# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

20-12-2024 శుక్రవారం పేజీలు 4 www.manabalagam.com


## కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్ అర్థమే మారిపోయింది

- మంత్రులే ప్రశ్నలు అడిగి ప్రశ్నోత్తరాల అర్థాన్ని మార్చుతున్నారు
- కొత్త సంస్కృతిని తీసుకరావొద్దు : హరీశ్ రావు



**హైదరాబాద్, డిసెంబర్ 19 :** కేబినెట్ నిర్ణయం అంటే సమష్టి నిర్ణయమని, క్వశ్చన్ అవర్ లో ఒక మంత్రి మరొక మంత్రిని ప్రశ్న అడగడం ఏంటని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రులే ప్రశ్నలు అడిగితే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందన్నారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లాలోని నీటి సమస్యలను గురించి సంబంధిత మంత్రిని ప్రశ్నించారు. దీనిపట్ల హరీశ్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల్లో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడటం ఏంటని,

మిగతా 3 లో

## కేటీఆర్ మెడకు ఈ -కార్ రేసింగ్

- 55 కోట్ల అవినీతిపై ఏసీబీ కేసు నమోదు
- ఎ1గా కేటీఆర్, ఎ2గా అర్వింద్ కుమార్ పేర్లు



**హైదరాబాద్, డిసెంబర్ 19 :** ఎట్టకేలకు కెటిఆర్ మెడకు ఈ కార్ రేసింగ్ అవినీతి ఉచ్చు బిగుసుకుంటోంది. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేసిన కేటీఆర్ పై కేసు నమోదు అయ్యింది. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై కేసు నమోదైంది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ ఎన్ రెడ్డిపై తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంలో పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ పై విచారణ జరిపేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇవ్వడంతో

మిగతా 2 లో




## ఆర్థికస్థితిపై చర్చ పట్ల విపక్షాల అసహనం

- సమాచారం లేకుండా చర్చ పెట్టారని ఆక్షేపణ
- విపక్షాల తీరుపై మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి. శాసనసభ నడుపుతున్న తీరుపై విపక్షాలు ఆక్షేపించాయి. సమాచారం లేకుండా ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విమర్శించాయి. శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ .. స్పీకర్ దృష్టికి తెచ్చారు. శాసనసభ నడిపే తీరు ఇది కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యాఖ్యానించారు. సభ్యులకు సమాచారం లేకుండా ఎలా మాట్లాడతారని బీజేపీ పక్షనేత మహేశ్వర్ రెడ్డి స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా? అని మండిపడ్డారు. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. 'హరీశ్ రావు, అక్బరుద్దీన్.. ఇద్దరూ సీనియర్ సభ్యులు. సమాచార లోపం జరిగిందని మేమే చెబుతున్నాం. అయినా క్షమాపణ చెప్పాలంటున్నారు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చేయొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా.. చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని బీఆర్ఎస్ నేతలు భావించడం లేదు. ప్రభుత్వ పరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటా.. జవాబుదారీగా ఉంటా. అంతేకానీ స్పీకర్ క్షమాపణ చేప్పాలంటే.. ఎలా సాధ్యం అవుతుందని శ్రీధర్ బాబు అన్నారు.



## ఔటర్ రింగ్ రోడ్డు టెండర్లపై సిట్ విచారణ

- అవినీతి అక్రమాలను వెలికి తీస్తామని వెల్లడి
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

..2 లో

శుక్రవారం,
20-12-2024

MANA BALAGAM

మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై వెల్లువెత్తిన నిరసన



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 (మన బలగం): కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు యువజన సంఘాలు తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర హోంశాఖ పదవిలో ఉండి ఇలాంటి వాఖ్యలు చేయడం దేశ ఔనత్యానికి భంగకరమని తెలుపుతూ ఆ వాఖ్యలు వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని అలాగే తన పదవికి రాజీనామా చేయాలని, డిమాండ్ చేస్తూ హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బట్టు శేఖర్ రాష్ట్ర నాయకులు గుజ్జరి ప్రకాష్ నాయకులు దివాకర్, రమణ, వినోద్,దేవానందం ఆనంద్, అశోక్, గంగాధర్, శీను తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్, ఎస్ఐలకు సన్మానం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 (మన బలగం): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికలో భాగంగా కోరుట్ల నియోజక వర్గ స్థాయిలో గెలిచిన యూత్ కాంగ్రెస్ నాయకులు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో గురువారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్, ఎస్ఐ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానం చేశారు. కార్య క్రమంలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ తేజ, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కొడి మ్యాల దీపక్ రాజ్, మండల అధ్యక్షుడు నల్లూరి సాగర్, ఉపాధ్యక్షులు అబ్బ రాహుల్, కోటగిరి సిద్దార్థ, మండల జనరల్ సెక్రటరీ భీంకర్ అఖిల్, కాంగ్రెస్ నాయకులు ముక్కెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మండల మాల మహానాడు కమిటీ ముందస్తు అరెస్ట్




ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 (మన బలగం): తెలంగాణ రాష్ట్ర మాల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన మాల నాయకులను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలేశారు. ఇక్కడ మాల సంఘం మండల అధ్యక్షుడు దేవానందం, ప్రధాన కార్యదర్శి వినోద్, గౌరవ అధ్యక్షులు శీను, ఉపాధ్య క్షుడు రవి, కోశాధికారి దినకర్, నాయకులు ప్రకాష్, గంగాధర్, శేఖర్, ఆనంద్, అశోక్, పెద్ద రాజం, రమణ, మురళి తదితరులు ఉన్నారు.

## ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

ధర్మారం, డిసెంబర్ 19 (మన బలగం): పెద్దపెల్లి జిల్లా, ధర్మారం మండల కేంద్రంలో పరికిపండ్ల నరహరి ఐఏఎస్ నిర్మించిన ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా శంకర ఐ హాస్పిటల్ ఇన్చార్జి పరి కిపండ్ల రామ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం స్థానిక సాధన జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసారు. ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు మాట్లాడుతూ 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, కంటి సమస్యలు ఉన్న 150 మంది రోగులను హైదరాబాద్ నర్సింగిలోని శంకర్ ఐ విజన్ సెంటర్‌కు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, డిప్యూటీ సీఈవో కీర్తి నాగర్జున, హాస్పిటల్ ఇంచార్జ్ పరికిపండ్ల రామ్, ధర్మారం ఇంచార్జ్ మామిడిశెట్టి శ్రీనివాస్, వెలుగటూర్ ఇంచార్జ్ గోపతి జనార్దన్, మంచిర్యాల్ ఇంచార్జ్ ముంగల మహేష్, సీనియర్ వాలంటీర్లు తిరుపతి, మహేష్ పటేల్, సాయవేని సతీష్, బొమ్మేన రమేష్, చంద్రశేఖర్, కన్నం వెంకటేష్, కన్నం పవన్, సంఘ వెంకటగిరి, సాధన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాజనవేణి కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఉప్పమల్ల నారాయణ, హాస్పిటల్ డాక్టర్ల బృందం, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఔటర్ రింగ్ రోడ్డు టెండర్లపై సిట్ విచారణ

హైదరాబాద్,డిసెంబర్19: ఔటర్ రింగు రోడ్డు టెండర్లపై విచారణకు ఆదేశిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఓఆర్ఆర్ పై విచారణ జరిపేందుకు సిట్ ఏర్పాటు చేస్తామని సీఎం అన్నారు. సభ్యుల ఆమోదంతో విచారణకు ఆదేశిస్తు న్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ టెండర్ల లీజుపై విచార ణకు సిట్ ఏర్పాటు చేస్తామని, త్వరలోనే విధివిధా నాలు ప్రకటిస్తామని అన్నారు. ఓఆర్ఆర్ పై జరపా లని హరీష్

రావు కోరడం అభినందనీయమని అన్నారు. ఓఆర్ఆర్ టెండర్లను ఎన్నికలకు హడావిడిగా, అప్పణంగా తక్కువ కట్టబెట్టారని విమర్శించారు. రూల్స్ లేకుండా హడావిడిగా అప్పనంగా ఎవరికో కట్టబెట్టారని, దేశం విడిచి పారిపోవాలనే ఓఆర్ఆర్ టెండర్లను అమ్ముకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో ఎన్నికల ముందు చేసిన ఆరోపణలకు అనుగుణంగా ఓఆర్ఆర్ టెండర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిట్ విచారణకు ఆదేశించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరిక మేరకు విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజ శేఖర్‌రెడ్డి జైకా నుంచి నిధులు తెచ్చి ఓఆర్ఆర్ నిర్మించారు. దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పన్నంగా టెండర్‌కు అప్పగించిందని ధ్వజమెత్తారు. ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్, ఐటీ కంపెనీలను తీసుకొచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేసింది కాంగ్రెస్ అన్నారు. క్రెడిట్ అంతా కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. అంతేకాకుండా ప్రజల అవసరాలు తీర్చాలని కృష్ణ, గోదావరి నీళ్లు తేవడానికి పీజేఆర్ ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌కు మెట్రో రైలు తీసుకొచ్చింది కూడా కాంగ్రెస్సే అని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారడానికి కాంగ్రెస్ కారణమని వివరించారు. వేల కోట్ల ఓఆర్ఆర్ ఆస్తిని అప్పన్నంగా అమ్ముకున్నారని బీఆర్ఎస్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలు ఓడిర చబోతున్నారని తెలిసి.. అమ్మేసుకున్నారని ఆరోపిం చారు. దేశం విడిచిపెట్టి పోవాలనే ఉద్దేశంతోనే ఓఆర్ఆర్ ఆస్తులను గత ప్రభుత్వాధినేతలు అమ్మేసు కున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హరీశ్‌రావు విచారణ కోరారు.. ఆయన కోరిక మేరకు సిట్ విచారణకు ఆదేశిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విధివిధానాలు కేబినెట్‌లో చర్చించి విచారణ చేయిస్తామన్నారు. ఆర్ఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సిట్ విచారణకు ఆదేశించడంపై హరీశ్‌రావు స్పందించారు. ఓఆర్ఆర్ టెండర్‌పై తాను విచారణ కోరలేదన్నారు. అయినా కూడా విచా రణను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ముందు టెండర్ రద్దు చేసి విచారణకు ఆదేశించాలని కోరారు.

# కేటీఆర్ మెడకు ఈ -కార్ రేసింగ్

మొదటి పేజీ తరువాయి

తదుపరి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. అందులో భాగంగా ఈ వ్యవహారంపై విచారణ చేప ట్టాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్ ) శాంతికుమారి మంగళవారం లేఖ రాశారు. ఫార్ములా రేసు పూర్వా పరాలు, అనుమతి లేకుండానే హెచ్ ఎండీఏ ఒప్పందం చేసుకో వడం, ఆర్బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్ తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ను, చీఫ్ ఇంజినీర్ ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్ పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది. దీంతో ఏసీబీ విచారణ వేగవంతం చేసింది. ఫార్ములా–ఈ ఆపరే షన్స్ , ఎస్ నెక్ట్స్ జెన్ , పురపాలకశాఖల మధ్య 9, 10, 11, 12వ సీజన్ల కార్ రేస్ లు నిర్వహించేలా ఒప్పందం కుదిరింది. 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నెªలకెస్ రోడ్డులో తొమ్మిదో సీజన్ రేసింగ్ నిర్వహించారు. 'అప్పటి మంత్రి కేటీఆర్ ఆమోదంతోనే ఒప్పందం కుదిరింది. శాఖాధిపతిగా ఎంవోయూ చేశా' అని ఒప్పందంపై ఐఏఎస్ అర్వింద్ కుమార్ సీఎస్ కు సమాధానమిచ్చారు. ఈ రేసు నిర్వహించిన విదేశీ సంస్థకు హెచ్ ఎండీఏ బోర్డు, ఆర్థిక శాఖ, ఆర్బీఐల అనుమతి తీసుకోకుండానే నేరుగా రూ.55 కోట్లు చెల్లించడం వివాదాస్పదంగా మారింది. ముఖ్యంగా రూ.46 కోట్ల వరకు డాలర్ల రూపంలో చెల్లించారనేది ప్రధాన అభియోగం. వీటన్నింటిపైనా అనిశా దర్యాప్తు చేయనుంది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు భావించిన, అనుమానించిన వారందరికీ ఏసీబీ నోటీసులు ఇవ్వనుంది. వారిని విచారించి, వాంగ్మూ లాలను నమోదు చేస్తుంది. అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే సంబంధిత ఆధారాలను సేకరి స్తుంది. ముఖ్యంగా ఇందులో నిధుల మళ్లింపు కోణం ఏమైనా ఉందా...? అనే అంశంపై ఎసిబి ఎక్కువ దృష్టి సారించనుంది. ఫార్ములా సంస్థకు చెల్లించిన రూ.55 కోట్లు ఎక్కడెక్కడి నుంచి చివరికి ఎవరి ఖాతాలోకి వెళ్లాయనే కోణంలోనూ పరిశీలించే అవ కాశముంది. ఫార్ములా–ఈ రేస్ నిర్వహించిన సంస్థలకు సైతం నోటీసులు జారీ చేయడానికి అవకా శముంది. అధికార దుర్వినియోగంపై ప్రాథమిక ఆధారాలు లభిస్తే... అందుకు బాధ్యులైన వారి అరెస్టు తప్పకపోవచ్చు. అదే జరిగితే మున్ముందు ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారం సంచలనాత్మకంగా మారుతుందని భావిస్తున్నారు. 2023, ఫిబ్రవరి 11న ఎంతో ప్రతిష్టాత్మకంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభు త్వం హుస్సేన్ సాగర్ చుట్టూ దాదాపు 2.8 కిలోమీటర్ల ఈ కార్ రేసింగ్ పెట్టింది. అయితే ఈ కార్ రేసింగ్ వ్యవహారినికి సంబంధించి దాదాపు రూ.55 కోట్ల వరకు ఆర్థిక శాఖ అనుమతి లేకుండా సంబంధిత డిపార్ట్ మెంట్ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీకి నిధులు విడుదల య్యాయి. అయితే రూ.55 కోట్ల వ్యవహారంలో అవక తవకలు జరిగాయని, నిధుల దుర్వినియోగం జరిగా యని ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఈ నిధుల గోల్ మాల్ పై విచార ణకు సర్కార్ ఆదేశించింది. ఆర్థికశాఖ అనుమతు లకు సంబంధించి ఎక్కడా రికార్డ్స్ లో లేకపోవ డంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. విదేశీ కంపె నీలకు ఇంత భారీ మొత్తాన్ని ఎలాంటి అనుమతులు లేకండా ఏ విధంగా అప్పగించారని దానిపై స్పష్టత లేకుండాపోయింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

# పక్కాగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**• కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, డిసెంబర్ 19 (మన బలగం): ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని భాగ్యనగర్‌లో కొనసాగు తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీ లించారు. సర్వేయర్లు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించారు. మొబైల్ యాప్‌లో నమోదు చేసిన వివరాలు దరఖా స్తుదారుల వాస్తవ వివరాలతో సరిపోయాయా లేదా అన్నది గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, దర ఖాస్తుదారుల స్థితిగతులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి సమాచారాన్ని సేకరించి మొబైల్ యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. దరఖాస్తుదా రులు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటోతో పాటు వారి ఫొటోను, స్వంత ఇల్లు అయితే నిర్ధారిత డాక్యుమెంట్లు కానీ, ఇంటి పన్ను చెల్లించిన రసీదులను యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. సొంత ఇల్లు నిర్మించుకునేందుకు దరఖాస్తు దారు చూపిన స్థలం, దాని డాక్యు మెంట్లను యాప్‌లో పొందుపర్చా లని సూచించారు. ఎలాంటి తప్పి దాలకు తావులేకుండా ఈ నెలాఖ రులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తహసీల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

MANA BALAGAM

మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

## వరి నారుమడి పరిశీలించిన వ్యవసాయ శాఖ అధికారులు



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19 (మన బలగం): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో రబీలో వేసే వరి పైరు నారుమడులను ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి అకు రాజ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 8,500 ఎకరాల్లో నార్లు పోసుకుని కొందరు రైతులు ప్రధాన పొలాన్ని సిద్ధం చేస్తున్నారని, అయితే ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండి అల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న తరుణంలో నారు సరిగ్గా ఎదగకపోవడాన్ని గమనించారు. చలి ప్రభావం నుంచి వరి నారును కాపాడుకోడానికి సాయంత్రం వేళలో నీరు తీసేసి ఉదయం వేళలో మరల నీరు అందించినచో చలి ప్రభావం నుంచి కాపాడుకోవచ్చని సూచించారు. ఎదుగుదల కోసం 2 గుంటల నారుమడికి 2 కేజీ యూరియా వేయాలని, చలి కారణంగా జింక్ లోపంతో ఆకులపైన తుప్పు పట్టిన మచ్చలుగా కనిపిస్తే చిలెటెడ్ జింక్ సల్ఫేట్ 2 గ్రాముల/లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పొలం వేసుకోడానికి వారం రోజులు ముందు 800 గ్రాముల కార్బొఫురన్ 3జీ గుళికలు చల్లుకునట్లైతే ప్రధాన పొలంలో మొగిపురుగు ఉధృతిని తగ్గించవచ్చని పేర్కొన్నారు. నాట్లు ఆలస్యం అయ్యే సమయంలో నారు ముదిరినట్లయితే మొక్కల సంఖ్యను పెంచుకుని నాటుకోవాలని సుచించారు. కార్యక్రమంలో మండల ఎఇఓ రవళి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శిశు మందిర్ పాఠశాలలో ఆదర్శ జన్మదినం

ముధోల్, డిసెంబర్ 19 (మన బలగం): ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న సాధ్గాం నమస్వి తన పుట్టిన రోజును పాఠశాలలో తన తోటి విద్యార్థులతో కలిసి జరుపుకుంది. సాంప్రదాయ బద్దంగా దీప జ్యోతిని వెలిగించి ధూపదీప నైవేద్యాలు సమర్పించి చదువుల తల్లి సరస్వతీ మాత, సకల శక్తి ప్రదాత సూర్య భగవానున్ని నమస్కరించింది. తల్లిదండ్రులు, పెద్దలు ఆచార్యుల ఆశీర్వాదం పొందింది. విద్యార్థులు జన్మదిన శ్లోకం ద్వారా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె జన్మదిన జ్ఞాపకార్థం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి అందరికీ ఆదర్శంగా నిలిచింది. ప్రధానాచార్యులు సారథి రాజు మాట్లాడుతూ పిల్లలు సంస్కారంతో పాటు భారతీయ సాంస్కృతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని పాశ్చాత్య సంస్కృతిని వీడనాడాలని పిలుపునిచ్చారు. అందరూ విధిగా వారి బాధ్యతలను గుర్తెరిగి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు కొండా వార్ సంజీవ్, అకాడమిక్ ఇన్‌చార్జి దేవేందర్ చారి, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సహజీవనం తప్పుడు విధానం

### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: సహజీవనం తప్పుడు విధానమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఇది సమాజ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. స్వలింగ సంపర్కుల వివాహాలతో.. సామాజిక వ్యవస్థ దెబ్బతింటుందని ఆయన ఆరోపించారు. యూట్యూబ్ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. బ్రిటన్‌లో అతి పెద్ద సమస్య సహజీవనమే అని, పెళ్లిని వ్యతిరేకించడం పెద్ద సమస్యగా మారినట్లు ఇటీవల బ్రిటీష్ పార్లమెంట్ వెళ్లినప్పుడు అక్కడ తమకు తెలిసిందన్నారు. ఒకవేళ మీరు పెళ్లి చేసుకోకపోతే, అప్పుడు మీరెలా పిల్లల్ని కంటారని గడ్కరీ అడిగారు. ఒకవేళ పిల్లలు పుడితే, వాళ్ల భవిష్యత్తు ఏంటి ఆయన ప్రశ్నించారు. సమాజ వ్యవస్థకు వ్యతిరేకంగా వెళ్తే, అది ప్రజలపై ఎటువంటి ప్రభావం చూపుతుందని ప్రశ్నించినట్లు తెలిపారు. సమాజం తనంతటే తాను నిర్ణయాలు తీసుకుంటుందని, కానీ దేశంలో లింగ నిష్పత్తి సమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ 1500 మంది మహిళలు, 1000 మంది పురుషులు ఉంటే, అప్పుడు ఇద్దరు భార్యలకు పురుషుల అర్హులని ఆయన అన్నారు. ఆదర్శ భారత దేశంలో విడాకుల్ని బ్యాన్ చేయాలన్న దాన్ని ఆయన ఖండించారు. సహజీవనం మంచిది కాదన్నారు. సేమ్ సెక్స్ మ్యారేజ్‌ను వ్యతిరేకిస్తూ గత ఏడాది సుప్రీంకోర్టుకు చెందిన అయిదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.

# బ్రాహ్మణ వెల్లంల భూసేకరణకు రూ.37 కోట్లు

- క్రమపద్ధతిలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం
- సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి
- హరీశ్ తీరుపై మండిపడ్డ కోమటిరెడ్డి







హైదరాబాద్, డిసెంబర్ 19: బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు రూ.37 కోట్లు విడుదల చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ వారంలో మరో రూ.22 కోట్లు విడుదల చేస్తామన్నారు. శాసనసభలో మాట్లాడుతూ..అన్ని ప్రాజెక్టులను పద్ధతి ప్రకారం పూర్తి చేస్తున్నట్లు ఉత్తమ్ చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. రెండేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కాస్ట్ బెనిఫిట్ రేషియో చూసుకుని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ కాల్వకు రూ.120 కోట్లు మంజూరు చేశామని.. త్వరలో టెండర్లు పిలుస్తామని ఉత్తమ్ పేర్కొన్నారు. మరోవైపు బీఆర్ఎస్ సభ్యులు సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. సభ ఆమోదం పొందని భూ భారతి బిల్లును చట్టంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. సభ్యుల హక్కులకు భంగం కలిగించేలా వ్యహరించారంటూ నోటీసులు ఇచ్చారు. శాసనసభ్యుల హక్కులను పరిరక్షించాలని సభాపతిని కోరారు. ఈ క్రమంలో శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య వాడీవేడి సంభాషణ జరిగింది. తొలుత మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో నీటి సమస్యపై చెప్పారు. ఓ వైపు ఫ్లోరైడ్, మరోవైపు మూసీ మురుగు నీటితో ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 70 శాతం పూర్తిచేసిన ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పు చేసినా దీన్ని పూర్తిచేయలేదన్నారు. తమ ప్రభుత్వం గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తుందని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 40 లక్షల మంది జీవితాలను కాపాడాలని జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌ను కోమటిరెడ్డి కోరారు. సీఎం, మంత్రులు అందరూ తమ జిల్లాకు అండగా నిలబడాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సభలో ఒక మంత్రి లేచి మరో మంత్రిని ప్రశ్నించే పరిస్థితి ఉండకూడదన్నారు. ఇలా ప్రశ్నలు అడిగేందుకు అవకాశమిస్తే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందని, లేని సంస్కృతిని తీసుకురావద్దని స్పీకర్‌ను కోరారు. 'ఉమ్మడి రాష్ట్రాన్ని ఎక్కువకాలం పాలించింది కాంగ్రెస్ పార్టీ. మా ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను ఉమ్మడి నల్గొండ జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించాం. దీనిపై చర్చ పెట్టండి.. ఎవరేం చేశారో చర్చిద్దాం. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే మేం కలగజేసుకోవాల్సి ఉంటుంది. గతంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారు. ఆయన హయాంలోనే మూసీ ఈవిధంగా తయారైంది' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు. హరీశ్‌రావు భారాసకు డిప్యూటీ లీడరా ఎమ్మెల్యేనా? ఏ హోదాతో మాట్లాడుతున్నారు? ఆయనకు ప్రశ్నించే హక్కు లేదు. ప్రతిపక్ష నేత ఏడాదిగా సభకు రాకపోవడం.. తెలంగాణ ప్రజలను అవమానపరచడమే. నల్గొండ ప్రజల కడుపులో ఆవేదన ఎలా ఉంటుందో చెప్పాను. డబ్బున్న వాళ్లు హైదరాబాద్ వచ్చారు. లేని వాళ్లు అక్కడ ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ నేతలకు కనికరం లేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం 70 శాతం పూర్తిచేశాం. నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్‌రావు ఒక్కసారీ సొరంగం వద్దకు రాలేదు. ఆయనకు నల్గొండ గురించి, నా గురించి మాట్లాడే హక్కు లేదు' అని అన్నారు.

# కాంగ్రెస్ వల్ల క్వశ్చన్ అవర్ అర్థమే మారిపోయింది

**మొదటి పేజీ తరువాయి**

ఒక మంత్రి మరో మంత్రిని ప్రశ్నించడం ఏంటన్నారు. కొత్త సంస్కృతిని సభలో తీసుకురావద్దని స్పీకర్ ను కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారని, వారి హయాంలోనే మూసీ మురికి కూపంగా మారిందన్నారు. అప్పుడు వారు సరిగ్గా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. అయితే ఏ హోదాలో అడుగుతున్నారని హరీశ్ రావును మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. ఆయనకు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్ కు సూచించారు. అనంతరం హరీశ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అతిఎక్కువ పాలించింది కాంగ్రెస్ పార్టీ. నేడు మూసీ వల్ల నల్లగొండ జిల్లా ప్రజలు బాధపడుతున్నారంటే దానికి ప్రధాన ముద్దాయి కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ 2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను నల్లగొండ జిల్లా, సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించేదే బీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందే, తాము ఏం చేశామో చర్చ పెట్టాలన్నారు. ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నకు సూటిగా జవాబు వచ్చినట్లయితే పది ప్రశ్నలకు ఆన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు మూడు నాలుగు ప్రశ్నలకే సభాసమయం సరిపోతుందని, ఒక్కో ప్రశ్నకు సూటిగా సమాధానం వచ్చేలా చూడాలన్నారు. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే తాము కల్పించుకోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వాటికి మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ను కోరారు.



మరోసారి అవకాశం ఇవ్వొద్దని స్పీకర్ ను కోరారు.

### ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం : హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 19: మెస్ చార్జీలు, రైతు బీమా, వ్యవసాయ యంత్ర పరికరాలకు డబ్బులు ఇవ్వలేదని నిరూపిస్తే తాను రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు సవాల్ విసిరారు. రాష్ట్ర రుణాలపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఛాలెంజ్ వేస్తున్నా.. భట్టి విక్రమార్క మాటల్లో నిజాయితీ ఎంత ఉందంటే.. నేతి బీరకాయలో నెయ్యి ఎంతనో భట్టి మాటల్లో నీతి అంత ఉంది. ఉట్టిఉట్టిగా మాట్లాడట్లేదు. రాజీనామా లేఖను స్పీకర్ ఫార్మాట్‌లో ఇస్తాను. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మెస్ ఛార్జీలు పెంచింది. వ్యవసాయ యంత్ర పరికరాలకు రాయితీ నిధులు ఇచ్చాం. నేను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామాకు నేను సిద్ధం. ఒక వేళ ఇచ్చి ఉంటే భట్టి విక్రమార్క రాజీనామా లేఖను సీదా గవర్నర్ గారికి ఇస్తారా..? అని స్పీకర్ ద్వారా హరీశ్‌రావు సవాల్ విసిరారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తొలి సంవత్సరము రూ. 1.27 లక్షల కోట్ల అప్పు చేసింది. ఈ లెక్కన అప్పులు చేస్తే ఐదేండ్లలోనే గత ప్రభుత్వ అప్పును మించిపోతారు. మేం పదేండ్లలో రూ. 7 లక్షల కోట్లు అప్పు చేస్తే.. వీళ్ల అప్పు ఐదేండ్లలోనే రూ. 7 లక్షల కోట్లు దాటిపోతోంది. రెవెన్యూ రాబడి, రెవెన్యూ వ్యయం పరంగా చూస్తే.. మేం కూడా మిగులు బడ్జెట్ రాష్ట్రాన్నే అప్పగించాం. రూ. 2.93 లక్షల కోట్ల బడ్జెట్‌తో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగించాం. రాష్ట్ర సొంత ఆదాయం రూ. 35 వేల కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెంచాం. కరోనా వల్ల, కేంద్ర ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రానికి ఆదాయం తగ్గింది. ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రంపై కొంత అప్పుల భారం పడిరది. కానీ కొన్ని పాత అప్పులను కూడా ఈ ప్రభుత్వం మా ఖాతాలో వేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అప్పులను మేం చేసినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది రూ. 4.17 లక్షల కోట్ల అప్పు మాత్రమే. రూ. 4.17 లక్షల కోట్ల అప్పును రూ. 7 లక్షల కోట్ల అప్పు అని తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏడాది కాలంలోనే రూ. 1.27 లక్షల కోట్ల అప్పు చేసింది. ఏడాదిలో రూ. 1.27 లక్షల కోట్ల అప్పు చేస్తే.. వచ్చే ఐదేండ్లలో ఎంత చేస్తారు..? భూములు కుదువపెట్టి అప్పులు తీసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ. 75 కోట్లకు ఎకరం చొప్పున టీజీఐఐసీ భూములు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.